గన్నవరం రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- ప్రయాణికుల ఆదరణ కరవు
- గ్రామానికి దూరాభారం
- కనీస సదుపాయాలు లేని వైనం
- గతుకుల మయంగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు



నిర్మానుష్యంగా ఉన్న గన్నవరం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం

గన్నవరం: నియోజకవర్గ కేంద్రంలోని గన్నవరం రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల ఆదరణ కరవైంది. రైల్వే స్టేషన్ గ్రామానికి దూరంగా ఉండడం, కనీస సదుపాయాలు లేకపోవడంతో రైలు ప్రయాణం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ఇక్కడ ఆగే రైళ్లను కూడా కుదించారు. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో రోజుకు నాలుగు మెమో రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. కనీస ఆదాయం కూడా రావడం లేదనే సాకుతో ఈ స్టేషన్ అభివృద్ధిని రైల్వేశాఖ పూర్తిగా విస్మరించింది. దీంతో రైల్వేస్టేషన్ సమస్యలతో కునారిల్లుతోంది. ఇప్పటికైనా రైల్వేశాఖ స్పందించి స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఎక్కువ రైళ్లకు ఇక్కడ హాల్ట్ సదుపాయం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనివల్ల ప్రయాణికుల ఆదరణ పెరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

బ్రిటీష్ హయాంలోనే నిర్మాణం

చెన్నై–హౌరా రూటులోని గన్నవరం రైల్వేస్టేషన్‌ను బ్రిటీష్ పాలకుల కాలంలో నిర్మించారు. గతంలో ఈ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల ఆదరణ బాగానే ఉండేది. రోజుకు సగటున పది రైళ్ల వరకు ఇక్కడే ఆగేవి. విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, రాజమండ్రి, కాకినాడకు రైళ్లు అందుబాటులో ఉండేవి. ప్రయాణికుల ఆదరణకు అనుగుణంగా రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు అందుబాటులోకి రాలేదు. ఇటీవల కాలంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, మైనర్ మరమ్మతులు మినహా పెద్దగా మార్పులు జరగలేదు. కనీస తాగునీటి వసతులు లేకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ లోపం కారణంగా మూలనపడ్డాయి.



రైల్వేస్టేషన్ ప్రధాన భవనం

రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారి, ఇరువైపులా దట్టంగా ముళ్ల కంచెలు పెరిగాయి. వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగకపోవడం వల్ల రాత్రివేళలో రైల్వేస్టేషన్‌కు వచ్చేందుకు ప్రయాణికులు భయపడే పరిస్థితి నెలకొంది. గన్నవరం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు దూరం లోపలికి ప్రయాణించాలి. గన్నవరం–ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మించినప్పటికీ ప్రయాణికుల సౌకర్యార్థం మెట్ల మార్గం మాత్రం ఏర్పాటు చేయలేదు.

నాలుగు రైళ్లకే హాల్ట్

ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో గత పదేళ్లలో ఇక్కడే ఆగే రైళ్ల సంఖ్య పది నుంచి నాలుగుకు పడిపోయింది. ఉదయం కాకినాడ, రాజమండ్రి నుంచి విజయవాడ వచ్చే మెమో రైళ్లు ఒక నిమిషం పాటు ఇక్కడ ఆగుతున్నాయి. సాయంత్రం విజయవాడ నుంచి కాకినాడ, రాజమండి వెళ్లే మెమో ట్రైన్‌లు ఆగుతున్నాయి. ఈ రైళ్లలో రోజుకు 30 నుంచి 50 మంది మాత్రమే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని స్టేషన్ అధికారులు చెబుతున్నారు. జనరల్ టికెట్ల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం రోజుకు రూ.500 కూడా ఉండడం లేదని అంటున్నారు. అయితే కూతవేటు దూరంలో ఉన్న విజయవాడ రైల్వేస్టేషన్‌పై పెరుగుతున్న ప్రయాణికుల భారాన్ని తగ్గించేందుకు శాటిలైట్ స్టేషన్‌గా దీనిని ఆధునీకరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా అమృత్ భారత్ పథకం ద్వారా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. ఈ దిశగా రైల్వే స్టేషన్‌ను తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సత్వర సేవలకు సమర్థంగా చర్యలు



కంకిపాడు: రెవెన్యూ పరమైన సేవలు త్వరితగతిన, సమర్థంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ వి.భావన్నారాయణ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకం మ్యూటేషన్‌కు 8, ఎఫ్‌లైన్‌కు 3, సబ్ డివిజన్‌కు 2, మొబైల్ సీడింగ్ 1, కోర్లేషన్‌కు 1, నష్టపరిహారం కోసం 1 అర్జీ అందాయి. తహసీల్దార్ మాట్లాడుతూ త్వరితగతిన అర్జీలపై విచారణ సాగించి సత్వరం న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, మాజీ సర్పంచ్ జయరామ్, మండల సర్వేయరు భాస్కర్‌రావు, వీఆర్‌ఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వరి కోతలు ఆలస్యం చేయండి



పెనమలూరు: వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున వరి కోతలు ఆలస్యం చేయాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె బుధవారం తాడిగడప, పెదపులిపాక గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం బాగా లేనందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరి కోతలు కొంత ఆలస్యం చేయాలన్నారు. రైతులు కోసిన వరి కప్పుకోవటానికి టార్పాలిన్లు అందజేస్తామని చెప్పారు. రైతులు దాళ్వాలో వరికి బదులుగా మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఏవోలు షరీఫ్, గోవర్ధిని, శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో సీఎస్ఐ చర్చిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ విజయవాడ శాఖ అధ్యక్షుడు దావులూరి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి రాము, డైరెక్టర్లు కె. నాగేంద్రకుమార్, రంగు దుర్గా ప్రసాద్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం అంపాపురంలోని పతంజలి ఫుడ్స్‌కు చెందిన పామాయిల్ ఫ్యాక్టరీలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అధిక సంఖ్యలో కార్మికులు రక్తదానం చేశారు. పతంజలి ఫుడ్స్ డీజీఎం కలపాల శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ చంద్రశేఖరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ (ఏలూరు) ప్రతినిధి కేవీ రమణ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

పెనమలూరు: తాడిగడప గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామం ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి కాలువ కట్టపై చింతా ప్రశాంతి అనే మహిళ బడ్డీకొట్టు నిర్వహిస్తోంది. అయితే ఆమె తన బడ్డీకొట్టులో అక్రమంగా మద్యం అమ్ముతోందని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు తనిఖీ చేయగా ఆమె వద్ద 7 మద్యం సీసాలు లభించాయి. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్యాయత్నం

నిందితునిపై కేసు నమోదు

పెనమలూరు: కుటుంబ తగాదాల కారణంగా ఓ వ్యక్తి తన ట్రాక్టర్‌తో ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టి హత్యాయత్నంకు పాల్పడటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పటమట జేడీ నగర్‌లో నివాసం ఉండే యార్లగడ్డ నాగశివ మంగళవారం తన బావమరిది పడమట రాజేష్‌తో కలిసి యనమలకుదురు కొండ వెనుక శివపార్వతీనగర్‌లో ఉంటున్న తల్లి కుమారిని చూడటానికి వెళ్లాడు. తల్లిని చూసిన తరువాత నాగశివ తన బైక్ పై రాజేష్‌తో కలిసి బయలుదేరాడు. ఈలోగా నాగశివ బావ పోసిన సాంబశివరావు తన ట్రాక్టర్‌తో వచ్చి ఉద్దేశపూర్వకంగా బైక్‌ను ఢీ కొట్టాడు. దాదాపు 150 అడుగులు బైక్‌ను ట్రాక్టర్‌తో ఈడ్చుకు వెళ్లాడు. బైక్ పై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. గతంలో నాగశివ అక్క పోసిన దుర్గకు బావ సాంబశివరావుకు విభేదాలు రావటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసి పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఈ కక్షతో సాంబశివరావు ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపటానికి యత్నించాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పెనమలూరు పోలీసులు సాంబశివరావుపై కేసు నమోదు చేశారు.

ముగిసిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ 2025–26పై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఎంపీడీఓ టి.స్వర్ణలత, డీఆర్పీ ప్రతినిధి శ్రీనివాస్ వివరించారు. పేదరిక నిర్మూలన, ఆహార భద్రతను కల్పించడం, పోషకత్వాన్ని మెరుగుపరచడం, ఆరోగ్య సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు తీసుకోవాల్సిన అంశాలను తెలియజేశారు. అనంతరం ముగింపు సభలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని మాట్లాడారు. ఈఓపీఆర్డీ టి.భారతి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రెండు కార్లను ఢీకొట్టిన బస్సు

పెనమలూరు: కానూరు కామయ్యతోపు సెంటర్‌లో ఓ బస్సు రెండు కార్లను ఢీకొట్టిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఉమాశంకర్‌నగర్‌కు చెందిన కారు డ్రైవర్ మల్లాది తేజ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ తాను మంగళవారం కారు నడుపుతూ కామయ్యతోపు సెంటర్‌లో విజయవాడ వైపునకు వెళ్లటానికి కారు మలుపు తిరుగుతుండగా విజయవాడ నుంచి పెదపారుపూడి వెళుతున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు అతి వేగంగా వచ్చి తన కారుతో పాటు మరో కారును ఢీ కొట్టిందని పేర్కొన్నాడు. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయని ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా పనిచేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.విగ్గిన్స్

విజయవాడ రూరల్: గ్రామాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా కృషి చేయాలని విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి.విగ్గిన్స్ అన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయాల ఉద్యోగులకు లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ గోల్ శిక్షణ కార్యక్రమాల ప్రారంభం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ విగ్గిన్స్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు నివాసిత ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. 2030 నాటికి గ్రామాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే విధంగా 9 థీమ్స్‌ను రూపొందించిందని వాటిని ప్రణాళిక ప్రకారం అమలు చేసుకుంటూ లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధురి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామానికి దోహదపడే అంశాలను వివరించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శ్వేత మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయడం, నీటిని రీసైక్లింగ్ చేసే అంశాల పై వివరించారు.

యనమలకుదురులో అక్రమ నిర్మాణం

చోద్యం చూస్తున్న అధికారులు



యనమలకుదురు కొండ వెనుక జరుగుతున్న అక్రమ నిర్మాణం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు కొండ వెనుక టీడీపీ నాయకుడు ఒకరు అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు. గ్రామంలో కొండ వెనుక సాయిబాబా గుడి ప్రాంతంలో ప్రభుత్వ కొండ పోరంబోకు భూమి ఉంది. గతంలో ఇక్కడ ఆక్రమణలు జరిగితే మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలు కూల్చి వేశారు. అదే విధంగా ఈ ప్రాంతంలో నేతల విగ్రహాల ఏర్పాటుపై కూడా హైకోర్టులో కేసు నడుస్తోంది. అయితే తాజాగా టీడీపీ నాయకుడు ఒకరు రంగంలోకి దిగి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టారు. దీనిపై మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోలేదు. అధికారుల వైఖరిపై కోర్టులో కేసు వేస్తామని స్థానికులు తెలిపారు.

రైతులకు మళ్లీ అల్పపీడనం

- మారిన వాతావరణంతో ఆందోళన
- పంటను సంరక్షించుకునే పనుల్లో నిమగ్నం



కంకిపాడు బైపాస్ మార్గంలో ఆరబోసిన ధాన్యంపై కప్పిన టార్పాలిన్ పట్టాలు

కంకిపాడు: బంగాళాఖాతంలో మరోసారి ఏర్పడిన అల్పపీడనం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. చేతికొచ్చిన పంట ఎక్కడ నోటికి అందకుండా పోతుందోనని భయపడుతున్నారు. కల్లాల్లో, రోడ్ల పక్కన ఉన్న ధాన్యం వర్షం బారినపడి దెబ్బతినకుండా సంరక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1.51 లక్షల హెక్టార్లలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగయిన విషయం తెలిసిందే. ఇప్పటికే 1.60 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు సమాచారం. కోత కోసిన ధాన్యాన్ని రైతులు మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ 23,320 మంది రైతుల నుంచి 2.24 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు. 22,835 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.448.43 కోట్లు జమ చేశారు.

అల్పపీడనంతో బెంబేలు

ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వైపు కోత కోసిన ధాన్యాన్ని ఆరబోసి తేమశాతం 17కు వస్తే మద్దతు ధర లభిస్తుందన్న ఆశతో రైతులు ఆరబోత పనులను చేసుకుంటున్నారు. ఇటీవల ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో రాశుల మీద ఉన్న అడుగు ధాన్యం తడిసి మొలక వచ్చింది. రైతులు ఎకరాకు ఏడు బస్తాలకు పైగా నష్టపోయారు. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం నుంచి తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోత కోసి ఆరబోసిన ధాన్యం రాశులపై పరదాలు కప్పి ధాన్యాన్ని సంరక్షించుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఆరబోతకు ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ధాన్యం ఆరబోత పూర్తయి మిల్లులకు తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్న తరుణంలో మళ్లీ ఈ వార్తలతో ఆందోళన చెందుతున్నారు. పంట నాణ్యతకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ సమయంలో ప్రకృతి విపత్తు ముంచుకురావటం, వర్షాలకు పంట దెబ్బతినటంతో రైతులకు నష్టం వాటిల్లింది. తేమశాతం ఎంత ఉన్నా, ఎలాంటి ధాన్యం అయినా సేకరణ చేసి మంచి ధర రైతులకు దక్కేలా అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మిల్లుల వద్ద ధాన్యం నిల్వకు ఆస్కారం లేకపోయినా ఏఎంసీ గోదాముల వద్ద భద్రపరిచి అక్కడి నుంచి మిల్లులకు తరలించి ధాన్యం దెబ్బతినకుండా చర్యలు తీసుకుందని గత ప్రభుత్వ సేవలను రైతులు గుర్తుచేసుకుంటున్నారు.

రేషన్ డీలర్ల ఎంపికకు నోటిఫికేషన్

పెనమలూరు: మండల పరిధిలో రేషన్ డీలర్ల ఎంపికకు తహసీల్దార్ గోపాలకృష్ణ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. మండల పరిధిలో విభజన ద్వారా 12 కొత్త రేషన్‌షాపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి రేషన్ డీలర్లను కొత్తగా ఎంపిక చేస్తామన్నారు.ఈ నెల 24వ తేదీ నాటికి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసే అభ్యర్థి నిరుద్యోగి అయి ఉండాలని, వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలని, ఇంటర్ చదవాలని, దరఖాస్తు చేసే అభ్యర్థి అదే గ్రామంలో నివాసం ఉండాలని, క్రిమినల్ కేసులు ఉండరాదని, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే దగ్గర బంధువులు ఉండకూడదని చెప్పారు. ఎంపికకు మౌఖిక పరీక్ష, రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కొత్త రేషన్ షాపులు ఇవే...

కానూరులో 5 రేషన్ షాపులలో ఓసీ మహిళకు 2, ఆర్థికంగా వెనుక బడిన వారికి 1, ఓసీ జనరల్‌కు 1, ఎస్సీలకు 1 కేటాయించారు. పోరంకిలో 4 షాపులు కేటాయించగా అందులో ఓసీ మహిళకు 1, బీసీ–ఎకు 1, ఎస్సీలకు 1, బీసీ–బి మహిళకు 1, పెదపులిపాకలో ఆర్థికంగా వెనుకబడిన వారికి 1, గంగూరులో ఎస్సీ మహిళకు 1, వణుకూరులో ఎస్సీలకు 1, గోసాలలో జనరల్ మహిళకు 1 చొప్పున నోటిఫికేషన్‌లో ప్రకటించారు.

14న సెయింట్ మేరీస్ వార్షికోత్సవం

కంకిపాడు: కంకిపాడులోని సెయింట్ మేరీస్ హైస్కూల్ వార్షికోత్సవం ఈనెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ముప్పల సాల్మన్‌రాజు తెలిపారు. ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రెస్టీనా డైసీతో కలిసి బుధవారం స్థానిక పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. 14వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. విజయవాడ పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ తెలగతోటి జోసెఫ్ రాజారావు అధ్యక్షతన జరిగే వేడుకలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వికార్ జనరల్ ఎంఎస్‌జీఆర్ మువ్వల ప్రసాద్, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, డీఈఓ పీవీజే రామారావు, ఆర్‌సీఎం స్కూల్స్ కోఆర్డినేటర్ రెవరెండ్ ఫాదర్ వల్లె విజయజోజి బాబు, సర్పంచ్ బాకీ రమణ పాల్గొంటారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులకు బహుమతులు అందిస్తామని వివరించారు.

నేడు పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం సాలిపేట ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా సాలిపేట, పెనమలూరు సెంటర్, ఏవీఎం గార్డెన్స్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, స్థానికులు సహకరించాలని కోరారు.

రహదారికి శంకుస్థాపన


పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో శ్రీనగర్ కాలువ కట్టపై సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాధాన్యతాక్రమంలో రహదారుల నిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, నర్రా చంటి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం



పెనమలూరు: పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్‌ను బుధవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ కమిషనర్ బాబు.ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి రామ్‌రాజ్ దుస్తులు అద్దం పడతాయని, అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దుస్తులు నాణ్యమైన కాటన్‌తో తయారైనందున యాంటీ బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్‌లను నివారిస్తాయని, షర్టులు, ధోతీలు, బనియన్లు తదితరాలతో దక్షిణాదితో పాటు ఉత్తర భారతదేశంలో కూడా మంచి గుర్తింపు సాధించిందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు, విజయ పికిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాటూరి రాము, రామ్‌రాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



ఆత్కూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

ఉంగుటూరు: భూ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.విమల కుమారి అన్నారు. ఆత్కూరు గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు మూడు అర్జీలు రాగా వాటిని అక్కడికక్కడే మంజూరు చేశారు. పాస్‌బుక్, అడంగల్‌లో మార్పుల కోసం 11 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ, జిల్లా సర్వేయర్ శైలజ, డివిజనల్ సర్వేయర్ నరసింహారావు, ఈవో పీఆర్‌డీ దిలీప్‌కుమార్, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, రామ్‌కిరణ్, వీఆర్‌వో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ని జయప్రదం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: ఈ నెల 13న మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక రాయ్‌నగర్‌లో అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం అన్నదాతను దగా చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా దళారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టిన నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు తిరివీధి రవి, మహిళా నాయకురాలు సూరెడ్డి మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితా ప్రకటన

ఈ నెల 14న ఎన్నికలు

పెనమలూరు: మండల పరిధిలో నీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితాను తహసీల్దార్ గోపాలకృష్ణ బుధవారం ప్రకటించారు.ఈ నెల 14వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీలు) ఎన్నికలు జరుగుతాయని అన్నారు. మండల పరిధిలో మూడు నీటి సంఘాలు వణుకూరు, పోరంకి, రొయ్యూరు ఉన్నాయన్నారు. వణుకూరు నీటి సంఘంలో టీసీలకు ఎన్నికలు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, పోరంకి నీటి సంఘంలో టీసీలకు ఎన్నికలు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తారు. రొయ్యూరు పరిధిలో ఉన్న 12 టీసీలకు ఎన్నికలు తాడిగడప జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతాయి.

గన్నవరంలో...

గన్నవరం: మండలంలోని 21 నీటి వినియోగదారుల సంఘాలకు(డబ్ల్యూయూఏ) అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, 168 నీటి పారుదల వ్యవస్థల్లో ప్రాదేశిక నియోజకవర్గాల(టీసీ) సభ్యులను ఎన్నుకునేందుకు ఫారం–3ఎ ఎన్నికల బహిరంగ ప్రకటనను బుధవారం విడుదల చేసినట్లు తహసీల్దారు కె.వెంకటశివయ్య తెలిపారు. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నిక పూర్తవుతుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటలలోపు నీటి వినియోగ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. భారీ నీటి పారుదల వ్యవస్థలకు సంబంధించి డిస్ట్రిబ్యూటరీ కమిటీ–11(నున్న), డిస్ట్రిబ్యూటరీ కమిటీ–3(బుద్దవరం) అధ్యక్షులు, ఉపాధ్యక్ష పదవుల ఎంపికకు ఫారం–3బి ప్రకటన కూడా విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 17న రెండు కమిటీల పదవులను భర్తీ చేయనున్నట్లు వివరించారు.

బాపులపాడు మండలంలో...

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలో మండల పరిధిలో 179 ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీ), 25 సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏ), 2 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయగా, ఆయా గ్రామాల పరిధిలో ఎన్నికల కేంద్రాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. వీరవల్లి, ఆరుగొలను, కానుమోలు, కాకులపాడు, రంగన్నగూడెం సాగునీటి వినియోగదారుల సంఘాలలో 12 చొప్పున ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీ) ఉండగా, మల్లవల్లిలో 11, వేలేరులో 10, రేమల్లెలో 7 టీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. మడిచర్ల, కొయ్యూరు, కోడూరుపాడు, మల్లవల్లి ఎద్దుల కుంట, వేలేరు కొత్త చెరువు, వేలేరు ఊర చెరువు, వేలేరు ఎర్ర చెరువు, వేలేరు లింగం చెరువు, కొయ్యూరు బండివాని చెరువు, మడిచర్ల పెద్ద చెరువు, అంపాపురం, వీరవల్లి పెద్ద చెరువు సాగునీటి సంఘాల్లో 6 చొప్పున ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. బిళ్లనపల్లిలో 5, బండారుగూడెంలో 3 టీసీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మండలంలోని 25 సాగునీటి వినియోగదారుల సంఘాలతో పాటుగా కృష్ణా డెల్టా ఆయకట్టు పరిధిలో కాకులపాడు చానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ, నాగార్జునసాగర్ ఎడమకాలువ జోన్–3 ఆయకట్టు పరిధిలో బాపులపాడు మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. ఏలూరు జిల్లా పరిధిలోని గోగుంట, కాకులపాడు కలిపి ఒక సాగునీటి వినియోగదారుల సంఘం ఉండగా, నందివాడ మండలం పెద్దలింగాల డబ్ల్యూయూఏకు చెందిన మూడు టీసీలు బాపులపాడు మండల పరిధిలోకి వచ్చాయి.

కంకిపాడు మండలంలో...

కంకిపాడు: సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు తహసీల్దార్ వి.భావన్నారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కంకిపాడు మండల పరిధిలో రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 8 సాగునీటి సంఘాలు ఉన్నాయని చెప్పారు. ఆయా సంఘాల పరిధిలో 96 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయని, వీటికి గానూ ఈనెల 14వ తేదీన ఎన్నిక జరుగుతుందన్నారు. అదే రోజు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక కోసం అదనపు సాధారణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నీటి వినియోగ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. ఈ సమావేశంలో ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక కోసం జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.